# "జీవన్ భద్రాణి పశ్యతి"

(క థా ని క)

చీకటిని చీల్చుకుంటూ పరుగెత్తుతూ కలకత్తా మెయిల్ స్టేషన్ సమీపించే ఉత్సాహంలో ఈలవేసింది. సెకండ్ క్లాస్ కంపార్టుమెంట్ లోంచి ఒకాయన తొంగిచూసి, 'స్టేషన్ వస్తోంది' అని తనలో తాను బిగ్గరగా అనుకున్నాడు. కునికిపాట్లు పడుతున్న ఓ యువతి ఆమాటలు విని కళ్లు తెరచి కిటికీలోంచి చీకటిలోకి ఓసారి తొంగిచూసి మళ్లీ కళ్లు మూసుకుంది. ఆమెకి ఎదురుగా ఉన్న బెర్తుమీద కూర్చున్న ఓ యువకుడు ఆమెవైపూ, కిటికీ లోంచి చూస్తున్న ఆయనవైపూ ఓసారి చూసి, 'దిగుతారా?' అన్నాడు. ఆ ప్రశ్న అడిగింది తనని కాదని సులభంగానే అర్థం చేసుకుని ఆ యువతి కళ్లు తెరవటానికి ప్రయత్నించలేదు. ఆయన యువకుడివైపు తిరిగి, 'లేదండీ ఇంకా చాలాదూరం వెళ్లాలి.' అని మళ్లీ, 'ఇక్కడ చాలాసేపు ఆగుతుం దనుకుంటాను. భోంచేసి రావొచ్చేమో?' అన్నాడు. అతను ఓసారి విసుగ్గా ఆయనవైపు చూసి 'ఆ' అన్నాడు.

రైలాగింది. ఆయన ఆయువకుడివైపు చూసి, 'చూడండీ మీ పేరేమిటో' అని నడిగాడు.

'చిరంజీవరావు.'

'అలాగా! నేను భోంచేసి వొస్తాను. కాస్త నా సామాను చూస్తూ ఉంటారుకదూ?'

'అలాగే లెండి.' అన్నాడు చిరంజీవరావు.

ఆ పెద్దమనిషి తన చిన్న సూటుకేసు తెరిచి పర్సుకోసం వెతకటం మొదలుపెట్టాడు. యథాలాపంగా సూటుకేసువైపు చూస్తున్న చిరంజీవరావు విద్యుద్దీపకాంతిలో తళతళ మెరిసే ఓ వస్తువువైపు చూసి ఉలిక్కిపడ్డాడు. ఆయన పర్సు వెతికి జేబులో వేసుకుని సామాను జాగ్రత్తని గురించి చిరంజీవరావుని మరోసారి హెచ్చరించి రైల్వే భోజనశాలవైపు వెళ్ళాడు.

ఆయన వెళ్ళిన కాసేపటికి, ఏదో ఆలోచిస్తున్న చిరంజీవరావు హఠాత్తుగా లేచి తలుపుకి తాళం వేశాడు. తలుపుకి, కిటికీలకి ఉన్న రెక్కల్ని దించేశాడు. కాసేపటి తర్వాత గంట కొట్టారు. రైలు కదిలే సమయంలో బయటి నుంచి కంపార్టుమెంటు తలుపు తట్టిన శబ్దం వినిపించింది. కాని చిరంజీవరావు లేవలేదు. ఆ యువతిమాత్రం ఒకసారి శబ్దం విని ఓసారి కళ్లెత్తిచూసి తలుపురెక్క, కిటికీ రెక్కలూ కూడా మూసిఉండటంచూసి గాభరాపడి, చిరంజీవరావువైపు ఓసారి చూసి తలుపు దగ్గిరికి వెళ్ళింది. కాని ఇంతలో రైలు కదిలింది. ఆమె కిటికీ రెక్కలుతీసి మళ్ళీ యథాస్థానంలో కూర్చుంది. భయాన్ని, గాభరాని, ఆందోళనని వ్యక్తపరచే ఆమె ముఖ కవళికలు చూసి చిరంజీవరావు అనుకోకుండా పక్కున నవ్వాడు. ఆ నవ్వుతో ఆమె పెదిమలు కూడా వణకటం ప్రారంభించాయి.

'ఎందుకంత గాభరా పడతారు?'

అనుకోని ఈ ప్రశ్న ఆమెని మరింత కలవరపెట్టింది, విననట్టు నటిస్తూ ఆమె కిటికీలోంచి దూరంలోకి చూడసాగింది. చిరంజీవరావు లేచి ఇందాకటి పెద్దమనిషి తాలూకు ట్రంకు తెరిచి అందులోంచి ఓ రివాల్వర్ తీశాడు. అతని చర్యని ఓరకంటితో కనిపెడుతున్న ఆ యువతి దిగ్గునలేచి గొలుసుదగ్గిరికి పరిగెత్తింది. చిరంజీవరావు దిగువనించి తటాలున ఆమె చెయ్యి పట్టుకుని ఆమెను యథాస్థానంలో కూర్చోపెట్టాడు. ఆమె నిస్సహాయంగా గొలుసువైపు చూసి కేకవెయ్యటానికి ప్రయత్నించింది గాని నోరు పెగలేదు.

"చూడండి. మీ పేరేమిటో..."

"నా పేరాశ. ఆశాలత" అందామె గాభరాగా.

'ఆశాలతగారూ, నేను మీకేమీ అపకారం చెయ్యను. మీరనవసరంగా గాభరా పడకండి.' ఆశాలత కాస్త స్థిమిత పడ్డది.

**"హేతశ్రీ"**

'మిమ్మల్ని ఇంత భయపెట్టినందుకు క్షమించాలి. కాని ఏం చెయ్యను! తప్పని సరి.' ఆమె

గుడ్లప్పగించి అతని వైపు చూసింది. చిరంజీవరావు జేబులోంచి ఓ కాగితం తీసి దానిమీద ఏదో రాసి మళ్లీ జేబులో పెట్టుకున్నాడు. రైలు వంతెనమీదినించి పోతూంది.

'మీకు కొంచెం కష్టం కలిగించక తప్పదు. దయచేసి మీరు కాసేపు బాత్ రూములోకి పోవాలి.'

ఆశాలత అతనివైపు అసహాయంగా చూసింది.

'కాసేపు మీరు ఇబ్బందిపడక తప్పదు.' అన్నాడు, అతను కొంచెం కటువుగా. అవమానంతో తల దించుకుని ఆశాలత బాత్ రూమ్ లోకి వెళ్లి తలుపు వేసుకుంది.

చెదిరిన మనస్సుని కుదటబరుచుకోటానికి ప్రయత్నిస్తున్న ఆశాలత 'ఢాం' అని పిస్తల్ పేలిన శబ్దం విని అదిరిపడ్డది. ఆమె నోటినుంచి వచ్చిన ఆర్తనాదం ఆమెకే వినపడలేదు. ఒక నిమిషం తరవాత 'డామిట్, అలారం పిస్టల్.' అనే కేక, ఏదో వొస్తువు విసురుగా చెక్కమీద కొట్టిన శబ్దం వినిపించిందామెకి.

'ఆశాలతగారూ, ఇహ మీరు రావొచ్చు.'

అప్రయత్నంగా ఆమె తలుపు తెరిచి కంపార్ట్ మెంటులోకి వొచ్చింది.

'అలారం పిస్టల్ చూసి మోసపోయాను.' అన్నాడు చిరంజీవరావు ఆమెవైపు చూసి.

ఆమెకిదంతా స్వప్నంలా గోచరించింది.

'చావటానికి ప్రయత్నించటం ఇది నాలుగో సారి. ఇది కూడా తప్పిపోయింది. ఛీ.'

'ఆత్మహత్య!' అంది ఆశాలత అప్రయత్నంగా.

'చూస్తే ఆ యముడికి నేనంటే కిట్టదల్లే ఉంది. అసలు ఈ పెట్టెలో మీరిద్దరూ లేకపోతే ఎప్పుడో పూర్తయిపోయి ఉండేది. రెండు కాలువలు దాటిపోయాయి!'

'చావటమెందుకు?' సంకోచిస్తూ అడిగింది ఆశాలత.

'బతకటమెందుకు?' కోపంతో అన్నాడు చిరంజీవరావు.

ఆమె అతనివైపు తేరిపార చూసింది. భగ్న హృదయుడు కాబోలనుకుంది. ఇదివరదాకా ఆమెని ఆవరించిన భయం క్రమంగా తొలిగిపోతోంది.

'చావులో ఎంత సుఖముంది!'

ఆశాలత అతనివైపు జాలిగా చూసి అంది: 'అప్పుడే జీవితంమీద అంత విరక్తి ఎందుకు కలిగింది మీకు?'

'విరక్తి కాకేమిటి? ఏముందీ ప్రపంచంలో? బతికి బావుకునేదేమిటి? అంతా కుళ్లు, స్వార్థం.'

అంతా కుళ్లు, స్వార్థం! ఆశాలత హృదయంలో ఈ మాటలు ప్రతిధ్వనించాయి.

'ఎక్కడ చూసినా నైతికపతనం; ఎవరిని చూసినా స్వార్థచింతనులే. ఎందుకి సంఘంలో బతకటం? పేరుకు మానవుడేగాని చేసేపనులు దానవత్వాన్ని నిరూపిస్తాయి. చీడపట్టిన ఈ లోకంలోంచి ఎంత త్వరగా నిష్క్రమిస్తే అంత మంచిది.'

'జీవితంలో మీరు బాగా మోసపోయారనుకుంటాను.'

'అన్నివిధాలా మోసగించబడ్డాను. ఉన్న డబ్బు ఘరానా దోపిడీలో పోయింది. చదివిన చదువు అక్కరకు రానిది. ప్రపంచంలో పుట్టి అనుభవించగల సుఖాలు నాకేమీ లేవని తెలుసుకున్నాను గనుక ఎద్దు జీవితంమీద అసహ్యం పుట్టింది. బతికి ఎవరిని ఉద్ధరించను? చస్తే ఒక జీవికి తిండి దొరుకుతుంది.'

'చచ్చి చేయగలిగిందేమిటి?'

'బతికి చేసేదికూడా ఏమీ లేదు.'

'ఏమైనా చెయ్యొచ్చు.'

'మీకింకా అనుభవంచాలదు.'

'ఒక నిండు జీవితపు అనుభవం సంపాదించుకున్నాను.'

'అంటే?'

'ప్రతి విషయమూ, మనిషి మాట్లాడే ప్రతీ మాటా తరిచి చూడాలనీ, తియ్యనిమాటల వెనకాల ఉండే విషం గ్రహించాలనీ.'

'గట్టి దెబ్బే తగిలినట్టుంది మీకు.'

ఆశాలత కళ్లు చెమ్మగిల్లాయి.

'ప్రపంచంఅందా వొట్టి బూటకం, నాటకం, అని తెలిసినప్పుడు ఇహ ఈ ప్రపంచంలో బతకటంలో అర్థంలేదు.'

'ఆత్మహత్య పాపంకదా?'

'పాపపుణ్యాలలో నాకు నమ్మకంలేదు.'

'ఏమైనా చచ్చిపోటం పరాజయం ఒప్పుకోటమే కాదా?'

'వాదంకోసం ఏమైనా అవొచ్చు. కాని బతకటంలో అర్థంలేక పోయినప్పుడు చావటమే శరణ్యం అని నా నిశ్చయం.'

'బతికితే సంఘాన్ని బాగుచెయ్యటానికి ప్రయత్నించవచ్చు కదా!'

'ఈ సంఘానికి మోక్షంలేదు. మానవుడిలో మానవత్వంకంటె దానవత్వమే నానాటికీ అధికమైపోతోంది. అరిషడ్వర్గాలు మానవుడిమీద పూర్తిగా అధికారం చలాయిస్తున్నాయి. ఈ మానవుడు తన పొట్టకోసం నోరులేని జంతువుల నిండు ప్రాణాల్ని తియ్యటానికి వెనుదియ్యని కిరాతుడు. తన లాభం కోసం, తన అస్తిత్వం కోసం, తన బాగు కోసం ఏపని చెయ్యటానికైనా జంకని స్వార్థపరుడు, తన ఆధిపత్యం స్థాపించుకోటం కోసం పొరుగువాడిమీద కత్తి కట్టి వాడిని ఘోరంగా చిత్రహింస చెయ్యటానికి సంకోచించలేని దుర్మార్గుడు. ఒక్క మాటలో చెప్పాలంటే మానవుడిని కోరలులేని దానవుడనవచ్చు.'

'మీరు ఒక పక్షమే మాట్లాడుతున్నారు. దానవత్వంతో పాటు దేవత్వంకూడా మానవుడికి ఉంటికదా.'

'అది నా అనుభవంలోకి రాని విషయం. రాదని తేల్చుకున్న మీదటే నేను నా నిశ్చయానికి వొచ్చాను.'

'చచ్చిపోటంకంటె వేరే మార్గమేమీ లేదా?'

'ఈ బాధల్ని తప్పించుకోటానికి నాకు తోచిన సులభమార్గం అదే. ఒక్క అయిదు నిమిషాలు కష్టమానుకొంటే చాలు, ఈ బాధల్నించి శాశ్వతంగా విముక్తికలుగుతుంది. ఒక్క అయిదు నిమిషాలు తర్వాత —ఎంతహాయి! ఎంత అనిర్వచనీయమైన ఆనందం! ఈ ఇహలోకపు బాధలేమీ ఉండవు. ఎక్కడికిపోతామో ఏమోగాని ఇటువంటి నరకంలో మాత్రం పడమని నాకు గట్టినమ్మకం ఉంది.'

'కాని...'

'క్షమించండి కాసేపు నన్ను మాట్లాడించవద్దు. మీరెంత వాదించినా నేను నా నిశ్చయం మార్చుకోలేను. యావజ్జీవితమూ బాధపడటం కంటె ఒక్క అయిదు నిమిషాలు ఓర్చుకోటం సులభమని ఏ మూర్ఖుడైనా గ్రహించగలడు.'

చివరి మాటలు ఆశాలత హృదయాన్ని ఊపాయి. ఆమె కళ్ళముందు ఆమె భవిష్యత్తు కనిపించసాగింది. తను నమ్మిన ప్రియుండిచేత ఆమె వంచించబడ్డది. సంఘం ఆమెవైపు వెయ్యి కళ్ళతో చూస్తోంది. అలాంటి పరిస్థితుల్లో తన భావిజీవితం ఎలావుంటుందో ఊహించుకోనిది కాదామె. ఒకసారి ఆమె పొరపాటు చేసింది. పొరపాటు పొరపాటే. ఇహ దానికి తిరుగులేదు. పశ్చాత్తాపపడ్డా ప్రయోజనంలేదు. సంఘం వేలెప్పుడూ ఆమె గతజీవితాన్నే చూపిస్తుంది. ఎందుకా పరువు ప్రతిష్టలులేని బతుకు బతకటం? అంతకంటే చావేమేలు. ఒక్క అయిదు నిమిషాలు.

ఆశాలత హృదయం జలదరించింది. యావజ్జీవితపు కష్ట నిష్ఠూరాలు: ఒక్క అయిదు నిమిషాల ఓర్పు - చిరంజీవరావు చెప్పింది ఆమె మనసుకు నాటింది. ఒక్క అయిదు నిమిషాలు ముక్కు మూసుకోటమే ఆచరణీయమనే తీర్పుకు వొచ్చిందామె.

'నేనుకూడా మీ నిశ్చయానికే వొచ్చాను'

'ఏమిటి?' అన్నాడు చిరంజీవరావు ఆమె వైపు ఆశ్చర్యంగా చూసి.

'ఆత్మహత్యే శరణ్యం' ఆశాలత గొంతస్వరంతో అంది.

'నిజం?' అన్నాడు అతను అపనమ్మకంగా.

'అవును. మనోవేదనలతో క్రమక్రమంగా చావటం కంటే ఒక్కసారి చావటమే మేలు'

'మీకు ధైర్యం ఉందా?'

'ఆ,' అందామె మనసు పీకుతూనే ఉన్నా.

'తర్వాత అనుకుంటే లాభంలేదు. బాగా ఆలోచించుకోండి.'

'ఆలోచించాను. నేనూ మీదారే అనుసరిస్తాను.'

చిరంజీవరావు ఒక నిమిషం మౌనం వహించాడు.

'అయితే సిద్ధంగా ఉన్నారా? ఇంకాకొంచెం సేపటిలో ఓకాలవ వొస్తుంది'

'గత్యంతరం లేదు. తప్పదు. సిద్ధంగా నే ఉన్నా' చిరంజీవరావు ఆమె వైపు ఓసారి జాలిగా చూశాడు.

'ఇంకా ఎంత సేపు?' అన్నది ఆశాలత మనసుని చిక్కబట్టుకుని.

'స్టేషన్ ఒస్తోంది. ఈ స్టేషన్ దాటగానే మనపని ముగించుకోవొచ్చు.'

రైలు, స్టేషన్ దాటింది. చిరంజీవరావు తలుపు తాళం తీసి తలుపు తెరిచాడు. రైలు వంతెన సమీపించింది.

'ఒకటి, రెండు, మూడు, అనేసరికి ఇద్దరం ఒక్కసారిగా దూకేసేయాలి.' అన్నాడు అతను. ఆశాలత అతనికి దగ్గిరిగా వొచ్చింది.

'ఒకటి, రెండు...మూడు.'

కాలువలో గభాలున రెండు మానవశరీరాలు పడ్డాయి. ఆశాలత రెండు గుటకలు మింగి చిరంజీవరావు భుజం ఆసరాగా తలపైకెత్తి భయకంపిత స్వరంతో అరచింది.

'నేను చావలేను. నాకు బతకాలని ఉంది. నన్ను రక్షించండి.' చిరంజీవరావు ఆమెవైపు కోపంగా చూశాడు.

'లాభం లేదు. మళ్ళీ ఆ ప్రపంచంలోకి వొద్దు. నామాట వినండి.' కాని ఆశాలత వినలేదు. పదేపదే ఆవేమాటలు అంటూ ఆమె అతన్ని బలిమాలసాగింది. చిరంజీవరావు మండిపడి అరిచాడు.

'ఈ తెలివి మొదటే మైంది? అప్పుడెందుకు వొప్పుకున్నావు!'

ఆశాలత అతనివైపు దీనంగా చూసింది. ఆమె కళ్ళలో జాలిని, భయాన్ని, వేడికోలుని చూసి చిరంజీవరావు మెత్తబడ్డాడు. ఆమెని చేతుల్తో నీటిమీదికి ఎత్తి ఆకాలవ ఈది ఒడ్డుకు చేర్చాడు. ఆశాలత వొణుకుతూ అతనివైపు క్షమించమన్నట్టుగా, కృతజ్ఞతతో చూసింది.

'ఛీ! అయిదోసారి కూడా నా ప్రయత్నం వ్యర్థమైపోయింది.' ఆశాలత ఆమాటలు విని ఎందుకో తృప్తిపడ్డది.

'ఇంత పిరికిదానివి, కాలవలో దూకగలనని ఎలా అనుకున్నావు అసలు?' తన ప్రయత్నం భగ్నం కావటంవల్ల కలిగిన విసుగు, చిరాకులతో అన్నాడు చిరంజీవరావు.

'ఇప్పుడు ఆలోచిస్తుంటే, ఎలా సాహసించానో నాకే ఆశ్చర్యంగా ఉంది. మీ మాటలు వింటున్నంత సేపూ నాలో అంతర్యుద్ధం జరిగింది. ఒంటరిగా ఆలోచిస్తే సాహసించే దాన్ని కానేమో!'

'అయితే ఆవేశంలో నిశ్చయించుకున్నారన్నమాట. ఇంకానయం, స్త్రీ హత్యా పాతకం చుట్టుకోలేదు'

'ఇహనైనా మీ నిశ్చయం మార్చుకోరా?'

'నాకంత హృదయ దౌర్బల్యం లేదు.'

'పుట్టినవాళ్లు ఎలాగో, ఎప్పుడో చావక తప్పదు. దానికి మనుష్య ప్రయత్నం అనవసరం. భూమిమీద పుట్టినవాడి లక్ష్యం కష్టాల్ని ఎదుర్కొని బతకటమేగాని బలవంతంగా చావటం కాదు. చదువుకున్నవారు, అనుభవాల అర్థం గ్రహించలేరా?'

చిరంజీవరావులో ఆశాలత అన్న చివరి మాటలు అమోఘంగా పనిచేశాయి. శూన్యంలోకి చూస్తూ అతనన్నాడు.

'నిజమే, కాని బతకటం ఎందుకు, ఎవరికోసం? ఎవరిని ఉద్ధరించను; కుళ్లుతో నిండిన ప్రపంచంలో మళ్లీ తిరగటానికి ప్రయత్నించటమా?'

'ప్రపంచం చూసి భయపడితే ఎలా? మీరింతవరకూ ప్రపంచంలోని చీకటినే చూశారు. వెలుగును చూడటానికి ప్రయత్నించరాదా? వెలుగుకోసం పరిశ్రమించరాదా?' చిరంజీవరావు ఆలోచనగా ఆమెవైపు చూచి, తరవాత శూన్యంలోకి కళ్లు తిప్పి పెదవి విరిచాడు.

'నామాట వినండి. పోనీ, నాకోసమైనా...' ఆశాలత పూర్తి చేయలేదు. వేదన, లాలన మిళితమైన ఆ మాటలు విని చిరంజీవరావు తల ఎత్తి ఆమె వైపు చూశాడు. ఆశాలత వేడికోలుగా, అతన్ని పూర్తిగా అర్థం చేసుకున్నట్టుగా అతనివైపు చూసింది. అశ్రుపూరితాలయిన ఆమె నేత్రాలవైపు తదేక దీక్షగా అరనిమిషం చూసి, చటుక్కున ఆమె పెదవులు ముద్దుపెట్టుకున్నాడు చిరంజీవరావు.

అదే సమయంలో దిక్కులు పిక్కటిల్లేలా చప్పుడు వినిపించింది. ఆ చప్పుడు విని అదిరిపడి నుంచున్నారు ఆశాలతా, చిరంజీవరావు. ఆశా

లత ప్రశ్నార్థకంగా చూసింది అతనివైపు. చప్పుడు వినిపించినవైపు ఇద్దరూ నడిచివెళ్లారు. ...కలకత్తా మెయిలు పడిపోయింది.

కలకత్తా మెయిలు ప్రమాదం గురించి దిన పత్రికలు ప్రచురించిన విశేషాల్లో ఒక చిత్రమైన సంఘటన ఇలా వర్ణించబడ్డది—

'...ఈ మెయిలు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు చాలా చిత్రంగా తప్పించుకున్నారని తెలుస్తోంది. ఈ మెయిలులో ప్రయాణం చేసి విచిత్రంగా తప్పించుకున్న ఓ ప్రత్యక్షసాక్షి కథనం ఇది. 'నేను, ఇంకొక యువకుడు, ఒక యువతి, ఇంజన్ పక్క పెట్టెకి ఆనుకుని ఉన్న సెకండ్‌క్లాస్ కంపార్టుమెంటులో ప్రయాణం చేస్తున్నాం. నేను మాల్స్‌కి స్టేషన్‌లో దిగి భోంచేసి తిరిగి మా పెట్టెదగ్గిరికి వొచ్చాను. కాని ఆ పెట్టె తలుపు, కిటికీలు కూడా వేసిఉన్నాయి. నేను తలుపుకొట్టి పిలిచేలోపుగా రైలు కదల టంవల్ల చివరఉన్న సెకండ్ క్లాసులో ఎక్కా. తరవాత స్టేషన్‌లో మారదామనుకున్నాను గాని నాకు తెలియకుండా నిద్రపట్టింది. ఒక పెద్ద శబ్దం, కుదింపుకి నేను మేలుకున్నాను. ఆ పెట్టె లోని యువకుడూ, యువతీ కూడా ఏదో స్టేషన్‌లో దిగిపోయి ఉంటారని విశ్వసించబడు తున్నది. ఆ కంపార్టుమెంటు పూర్తిగా తున కలైపోయింది. ఆప్రదేశం వెదకగా చెల్లాచెదరై పోయిన సామానులేగాని మానవశరీరాలు ఏవీ కనుపించలేదు.'

ఆవార్త చదివి చిరంజీవరావుతో నవ్వుతూ అంది ఆశాలత.

'మీ ఆత్మహత్యా ప్రయత్నంలో ఇద్దరి ప్రాణాల్ని కాపాడారు. ఆ ఇద్దరూ యావజ్జీ వమూ మీకు ఋణపడి ఉంటారు.'

'నీఋణం తీర్చుకున్నావుగా.' అన్నాడు చిరంజీవరావు పడిపోయిన మెయిలు బొమ్మ చూస్తూ.

# రాష్ట్రాలు: ఆదాయపు పన్ను పంపకం

"మొఖాసునవీసు"

జనవరి మాసాంతమున రిజర్వు బ్యాంకు మాజీ గవర్నరు సర్ చింతామణి దేశముఖ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలమధ్య ఆదాయపు పన్ను పంపకమునకు చేసిన నివేదిక పెక్కు రాష్ట్ర ప్రభుత్వములకు, ఆర్థిక శాస్త్రవేత్తలకు, ప్రజలకు తీవ్ర అసంతృప్తి కలిగించిందనడంలో అతి శయోక్తిలేదు. ఈ అసంతృప్తికి కారణం 1936 చట్టం సమాఖ్యరాజ్యాంగం స్థాపననాటి నుండి అనువంశికంగా వచ్చుచున్న ఆర్థిక స్థాలి త్యమే యీ నివేదిక యందుకూడా ద్యోతక మౌతోంది. గత విషయములను సింహావలోకన చేయటం యీ నివేదికా విమర్శకు అత్యం తావశ్యకము.

మాంటు ఫర్డు చట్టం అనుసరించి రాష్ట్రాధి కారాలు, ఆదాయాలుస్వల్పాతిస్వల్పం. 1935 చట్టం అనుసరించి దేశమందు ఒక విధమగు సమాఖ్య రాజ్యాంగం నెలకొల్ప బడింది. రాష్ట్ర స్వయంపరిపాలనతో, రాష్ట్రాధికారాలువిస్తృతం చేయబడినవి. అధికారాలకు సరియగు ఆదా యాభివృద్ధి రాష్ట్రాలకు రాలేదు. దత్తత చేయ బడిన ఆధారాలవలన వచ్చు ఆదాయం సమాజ పురోభివృద్ధి పథకములకగు ఖర్చులే తగినంత విస్తృతంగాలేవు. పాత గాడీలలో నడుస్తూవుం టేనే అనూ వ్యయాలకు అత్తెసరు అవుతుంది. ఇట్టి ఆదాయాన్ని ఆర్థికశాస్త్ర పరిభాషలో (inelastic) అంటారు. దీనికి స్థూలంగా అర్థం చెప్పాలంటే అవసరావసరాలనుబట్టి సంకోచ వ్యాకోచాలు పొందని ఆదాయం. రాష్ట్రాదా యాలను ఇతోధికం చేయు ఆవశ్యకతను గమ నించి సర్. ఆటో నిమియర్ 1936 లో తన నివేదికలో ఆ దా య పు ప న్ను పంపకం సూచించేడు.

రాష్ట్రాలకు, కేంద్రం యిచ్చే తఖ్సీలు (grants-in-aid), ఋణాలు, అభ్యుదయ